
REGD. NO. A. 18 విడి ప్రతి 0-20 న. పై శుక్రవారం 17-2-61

# జమీన్ రైతు

సంస్థాపకులు : నెల్లూరు వెంకట్రామానాయుడు

సంపుటి 33 * సంపాదకుడు : నెల్లూరు శ్రీరామమూర్తి * సంచిక 7





# నెల్లూరుజిల్లాలో మంత్రిద్వయదిగ్విజయయాత్ర

## భావస్ఫోరకంగా ఏ.సి. పై విసుర్లు, హేళనలు, ఎత్తిపొడుపులు!

—o—

### గూడూరులో సన్మానానికి, సభకు స్వతంత్రపార్టీ అధ్యక్షుని అధ్యక్షత

294 రోజుల తర్వాత ముఖ్యమంత్రి శ్రీ దామోదరం సంజీవయ్య, పబ్లిక్ వర్క్సు శాఖామాత్యుడు శ్రీ అల్లూరు సత్యనారాయణరాజు గారలు నెల్లూరు జిల్లాలో రెండవసారి దిగ్విజయయాత్రజేశారు. అఖండమైన సన్మానాలు, సభలు, వుత్సాహ భరితమైన దృశ్యాలు అనుభవించారు, తిలకించారు, ఆనందించారు.

అయితే అనాటి పరిస్థితులు వేరు; యీనాటి వాతావరణం వేరు. అనాటి అధిపత్యం శ్రీ ఏ. సి. సుబ్బారెడ్డిగారిది; ఏ. సి. మంత్రి అయ్యాడనే సహజ ఆనందాతిశయాలు అనాటి వుత్సవాలకు మేళవించినవి. ఈనాటి అధ్వర్యం శ్రీ వంగల్లు కోదండరామరెడ్డిగారిది; శ్రీ సుబ్బారెడ్డిగారి సుదీర్ఘమైన అధికార వ్యాపక కారణంగా పేరుకున్న వ్యతిరేకత యీనాటి సత్కారాలకు సంఘటిత శక్తియై నిలచింది. అయితే కారణం ఏదైనా, అధ్వర్యం ఎవ్వరిదైనా వీటి సత్ఫలితాలను పొందినవారు మాత్రం – అనాడు ఈనాడుకూడా ఒక్కరే–శ్రీ సంజీవయ్య, సత్యనారాయణరాజు–గావడం గమనార్హం.

శ్రీ సుబ్బారెడ్డి అధికారవర్గంతో ఘర్షణపడి, మంత్రిత్వాన్ని వదలుకున్ననాటినుండి వున్న వ్యతిరేకులలోవున్న ఆలోచన, ప్రయత్నం యీనాటికి విజయవంతంగా నెరవేరింది; గారికి మంత్రులమీద మమకారంకంటే, సుబ్బారెడ్డిగారిమీద ద్వేషమే కారణంగా వుంటుంది. అట్లనే ఫలితంకాంగ్రెస్‌కు చెందినా సుబ్బారెడ్డిమీద కససాధింపు లక్ష్యంగా

### నెల్లూరులో బ్రహ్మాండమైన ఉత్సవము : సభ

సుబ్బారెడ్డిగారి ప్రమేయం లేకపోయినా, పరోక్షారం లోపించినా నెల్లూరులో శమస్థానం అద్వితీయమైనదని మంత్రులు, తత్ పక్షీయులు రుజువు చేయదలచుకున్నారు; కృతకృత్యులైనారు.

మంత్రుల యీ సన్మాన కార్యకలాపాలతో నెల్లూరుజిల్లాలోని ఏ. సి. సుబ్బారెడ్డి వ్యతిరేకులు, పార్టీ వర్గకారకత్వాలను అవతలపెట్టి, సంఘటితపడినారు. అయితే మంత్రులకు యింతచక్కని ఏర్పాట్లుచేయడంలో ఎవరి కారణం వారికుంటుంది. శ్రీ వంగల్లు, దశరథరామిరెడ్డిగారలకు సుబ్బారెడ్డిమీద వుండే వ్యతిరేకతకంటే, మంత్రులకు బ్రహ్మరథం పట్టాలనే పట్టుదలకంటే, కావలి–కనుపూరు కాల్వల సాధనే ప్రధానంగా వుంటుందని మా భావం. శ్రీ బెజ్జెలకంటి రాఘవయ్య చేరినవారే ప్రతిపక్షీయులుగూడా. రాజకీయ రాగద్వేషాలు లేకుండ, మాత్సర్యలు లేకుండ వున్న కొందరుగూడా యిందులోకి లాగబడక పోలేదు. ఎట్లయితేనేమి శ్రీ సుబ్బారెడ్డి వ్యతిరేకత వుప్పెనగా విజృంభించి నగ్నంగా ప్రదర్శితమైంది. అంతేగాని యిది శ్రీ సంజీవయ్య మంత్రివర్గంమీద ప్రజాభిప్రాయంగా, సత్యనారాయణరాజు చర్యలకు ఆమోదముద్రగా, లేక మరొకరి ప్రగల్భంగా తీసుకొబడితే, అది పొరబాటే అవుతుంది.

అయితే శ్రీ సుబ్బారెడ్డిగారు, వారిఅనుయాయులు ఈ సంఘటన మూలంగా నేర్చుకోవలసిన పాఠాలు, గడించవలసిన అనుభవం మాత్రం చాలవున్నది.

—కొరవ 12-వ పేజీలో.

**WE WELCOME**

THE QUEEN ELIZABETH.
The Beauty of our Saries is Dedicated to Her Majesty.



RAYAVARAPU SANKARIAH & SONS
CLOTH MERCHANTS
NELLORE (A. P.) INDIA.

# కార్యరూపం పొందిన కల-కనుపూరుకాల్వ

# రెండుదశలలో 181 లక్షలఖర్చుతో 78 వేల ఎకరాలకు

# నీటివసతికల్గించే ఈ పథకానికి ముఖ్యమంత్రిచే శంఖుస్థాపన

—o—

## శ్రీ కోదండరామరెడ్డి కార్యసాధకుడని ప్రశంస

కనుపూరు కాల్వకు మాఘ బహుళ చతుర్దశి మంగళవారం (14 తేది) ఉదయం 9-05 గంటలకు ముఖ్యమంత్రి శ్రీ దామోదరం సంజీవయ్య మంత్రోక్తంగా శంఖుస్థాపన గావించారు.

ఈ కార్యక్రమం సంగంవద్ద పెన్నకు దక్షిణపు ఒడ్డున విజయవంతంగా జరిగింది. రాష్ట్ర పబ్లిక్ వర్క్సు శాఖ సలహాదారు పద్మభూషణులు శ్రీ వెంకటకృష్ణయ్యర్, పి. డబ్ల్యు. డి. స్పెషల్ ఛీఫ్ ఇంజనీరు శ్రీ వెంకట్రామన్, సూపరింటెండింగు ఇంజనీరు బషీర్ అహమ్మద్; శ్రీ తిక్కవరపు రామరెడ్డి ప్రభృతి మండలప్రముఖులు; కనుపూరు కాల్వ రైతు ముఖ్యులనేకమంది యీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సంజీవయ్య, పబ్లిక్ వర్క్సు శాఖా మాత్యులు శ్రీ సత్యనారాయణరాజు గారలు పూజాదికా లొనరించారు. తర్వాత ముఖ్యమంత్రి శాస్త్రోక్తంగా కనుపూరుకాలువ తూములకు పునాది రాయి వేశారు. శంఖుస్థాపన చిహ్నంగా అమర్చబడిన పాలరాతి ఫలకాన్ని ఆవిష్కరించారు. శంఖుస్థాపన శుభచిహ్నంగా మంగళతూర్య నాదాలు మ్రోగాయి.

పిమ్మట పి.డబ్ల్యు.డి. శాఖవారిచే అందంగా, ఆకర్షణీయంగా, విశాలంగా నిర్మింపబడిన బ్రహ్మాండమైన పందిరిలో సభ జరిగింది. చుట్టూ మైలు దూరంలో ఏ గ్రామమూ లేకపోయినా, సభా వేళ సమయం ఉదయమైనా, జనలోకముంటుందేమోనని అధికార్లు ఆందోళనపడినా, అంతపెద్ద పందిరి స్త్రీ పురుషులతో క్రిక్కిరియడం విశేషం.

### కోదండరామరెడ్డి


కనుపూరు కాల్వ భగీరథుడు శ్రీ పంగల్లు కోదండరామరెడ్డి మంత్రులకు స్వాగతం చెప్తూ, యీ సంఘటన జిల్లా చరిత్రలో గొప్పవిశేషంగా పేర్కొన్నారు. నాగార్జునసాగర్ వంటి పెద్ద ప్రాజెక్టులమూలంగా వెనుకబడినా; కావలి-కనుపూరు కాల్వలు వచ్చినా, సోమశిలప్రాజెక్టు వచ్చినప్పుడే ఈ జిల్లాకు ఎక్కువ ప్రయోజనమని పునర్ఘాటిస్తూ, యీ ప్రాజెక్టుకు ప్రత్యేక ప్రాధాన్యతివ్వవలసిందిగా శ్రీ కోదండరామరెడ్డి మంత్రులకు విజ్ఞప్తిచేశారు.

ఆనందోత్సాహాలు ముప్పిరిగొనగా, గద్గదకంఠంతో శ్రీ కోదండరామరెడ్డి యింకా యిలా అన్నారు—

"నా జీవితంలో యిటువంటి కార్యక్రమం జరుగగలదనే అనుమానముండినది. ఈ కాల్వకు శంఖుస్థాపన జరిగిన యీనాడు కనుపూరు కాల్వ రైతులకంటే నాకు ఆనందంగా వున్నది. సర్వేపల్లి నియోజకవర్గంలో 1955 ఎన్నికలలో శ్రీ గోపాలరెడ్డిగారు నిలిచారు. ఏ గ్రామానికెళ్లినా ఏమిచేస్తారు? కనుపూరు కాల్వఅయినా యిస్తారా? అని ప్రశ్నించారు. కనుపూరు కాల్వ తప్పక వస్తుందని, సందేహం లేదని శ్రీ గోపాలరెడ్డి ఆనాడు యెంతో నమ్మకంగా చెప్పారు. తర్వాత వారు రాజీనామాయిచ్చి, నేను పోటీచేసినప్పుడుగూడా అదే నినాదం. దీనినిగూర్చి శ్రీ గోపాలరెడ్డి మొదట చెప్పినంత గట్టిగా చెప్పలేను. నాకు భయంవేసింది. కానీ ధర్మశీలి ప్రత్యేకించి, దేముడు శ్రీ వెంకటకృష్ణయ్యర్ యీ కాల్వ తప్పక వస్తుందని ఎంతో ధైర్యం కల్గించేవారు. స్పెషల్ ఛీఫ్ ఇంజనీరు శ్రీ వెంకట్రామన్ ఈ కాలువల స్కీమును తయారుచేశారు. మా ముఖ్యమంత్రి శ్రీ సంజీవయ్య, శ్రీ సత్యనారాయణరాజు గారలు నామీద అభిమానంతో శంఖుస్థాపనచేశారు.

—కొరవ 8వ పేజీలో.





# పదికోట్లు అప్పయిస్తే సోమశిల నిర్మిస్తారట!

## మూడవప్రణాళికలో దీనినిచేర్చడం అసాధ్యమని మంత్రుల ప్రకటన

### సోమశిల అవసరాన్ని మంత్రుల దృష్టికిదెస్తూ జిల్లా రైతుకాంగ్రెస్ మహాసభ తీర్మానం

"సోమశిల ప్రాజెక్టు కావలని నేనూ జెప్పగలను. కాని వచ్చే అయిదేళ్లలో ప్రారంభిస్తామని మాత్రం చెప్పలేను. ఇరువదేండ్ల నీటివనరుల బృహత్పథకంలో సోమశిలచేరివుంది. ముఖ్యమంత్రికూడ ఆలోచన జేస్తున్నారు. ఈజిల్లాలో యీ ప్రాజెక్టునుకూడ నిర్మిస్తే ఆంధ్రదేశం సర్వాంగసుందరం కాగలదు. సోమశిలప్రాజెక్టు నిర్మాణ వ్యయం రు. 10 కోట్లు మీరు అప్పయిస్తే యీ ప్రాజెక్టునుగూడ ప్రారంభిస్తాం. 10 కోట్లు ఒక్కసారిగా యివ్వనవసరంలేదు. ఏటా రెండుకోట్లు యివ్వండి. నెమ్మదిగా ఆలోచించండి. పెద్దలు శ్రీ తిక్కవరపు రామరెడ్డి అధ్యక్షతన కమిటీ వేసి ప్రయత్నించండి. కేంద్రమంత్రి డాక్టర్ గోపాలరెడ్డిగారితో సంప్రదించండి. ఆంధ్రప్రభుత్వంకూడ సానుభూతితో ఆలోచిస్తుంది. సానుభూతి చూపడమే కాదు, సాధించిపెట్టగలదని హామీ యిస్తున్నాను" అని నెల్లూరుజిల్లా రైతుకాంగ్రెస్ మహాసభలో ప్రసంగిస్తూ ఆంధ్రప్రదేశ్ ఇర్రిగేషన్ శాఖామంత్రి శ్రీ అల్లూరి సత్యనారాయణరాజుగారన్నారు.

ఈ నెల 14 వ తేది సాయంత్రం నెల్లూరు టౌన్‌హాలులో శ్రీ తిక్కవరపు రామరెడ్డిగారి అధ్యక్షతన నెల్లూరుజిల్లా రైతుకాంగ్రెసుమహాసభ జరిగింది. జిల్లా నలుప్రాంతాల నుండి రైతుకార్యకర్తలనేకమందివచ్చి మహాసభలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి శ్రీ డి. సంజీవయ్య, పి. డబ్లు. డి. మంత్రి శ్రీ అల్లూరి సత్యనారాయణరాజుగారలు ప్రసంగించారు.

#### సంజీవయ్య

ముఖ్యమంత్రి శ్రీ సంజీవయ్య మహాసభలో ప్రసంగిస్తూ, సోమశిలప్రాజెక్టు విషయం ప్రస్తావించి యిట్లా అన్నారు.

"ఏపనికైనా మానవప్రయత్నంతోపాటు దైవబలం వుండాలి. కాలం కలిసిరావాలె. మూడేండ్లుగా ఆందోళనచేస్తే కావలి–కనుపూరు కాల్వలు ఈనాటికి వచ్చాయి. అట్లే సోమశిలప్రాజెక్టుకూడ ఒకనాటికి తప్పక వస్తుంది. దీనివ్యయం 10 కోట్లు రైతులు భరిస్తే ప్రాజెక్టును నిర్మిస్తాం"

నెల్లూరుజిల్లాలో ఒక వ్యవసాయపనిముట్ల ఫ్యాక్టరీని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందని ముఖ్యమంత్రి వెల్లడించారు.

తర్వాత శ్రీ సత్యనారాయణరాజు మాట్లాడుతూ కృష్ణాప్యారేజి విషయంలో ప్రకాశం పంతులు ప్రదర్శించిన ధైర్యాన్నే కావలి–కనుపూరుకాల్వల విషయంలో ముఖ్యమంత్రి శ్రీ సంజీవయ్య కనపరచారన్నారు.

#### తిక్కవరపు రామరెడ్డి

సభాధ్యక్షులు శ్రీ తిక్కవరపు రామరెడ్డి మాట్లాడుతూ, పెన్నా నది జీవనదికాదనీ, నదిలోజాలపాటు వరదలు వినపోయిస్తే ఆ నదిలో తర్వాత నీరుండదనీ, గుంటూరు జిల్లాలోవలె నెల్లూరుజిల్లాలో సారవంతమైన భూములు లేవని అన్నారు.

శ్రీ రామిరెడ్డిగారు యింకా యిట్లన్నారు: పెన్నాడెల్టాక్రింద రెండులక్షల ఎకరాలు సాగౌతున్నవి. అందులో 1లక్ష40 వేలఎకరాలే కాలువక్రింద నీటివసతితో సాగవుతున్నవి. ఈ డెల్టాకు ఆయువుపట్టయిన కనిగిరిరిజర్వాయరు, నెల్లూరు చెరువు పూడిపోతున్నవి. ఈ పూడిక తీసివేయుటం సాధ్యమయ్యేపనికాదు. డెల్టాపోగా మిగిలినజిల్లాఅంతా వర్షాధారంమీదనే సాగవుతున్నది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు రెండవదశ వుంటుందనే ఆశలేదు. దక్షిణ నెల్లూరు ప్రాంతానికి నాగార్జునసాగర్ ప్రాజెక్టుకంటె సోమశిల ప్రాజెక్టువల్లనే ఎక్కువ ప్రయోజనం. దీనిక్రింద మొత్తం 12 లక్షల ఎకరాలు సాగవుతుంది. ప్రాజెక్టు నిర్మాణవ్యయం తక్కువ. మంచి వరుంబడి వుంటుంది. ఎన్నో బీడుభూములు త్వరగా వ్యవసాయ యోగ్యమయ్యే అవకాశముంది. మూడవ ప్రణాళికలోగాకపోయినా నాల్గవ ప్రణాళికలోనైనా యీ ప్రాజెక్టు వచ్చేటట్లు చూడండి"

కావలి, కనుపూరుకాల్వల ఆందోళనోద్యమం, కావలి కాల్వవిషయంలో డాక్టరు గోపాలరెడ్డికట్ల కావలిరైతుల అసంతృప్తిని గురించికూడా శ్రీ రామిరెడ్డిగారు ప్రస్తావించారు.

#### సోమశిల తీర్మానం

సభా ప్రారంభంలోనే శ్రీ బొమ్మా శేషురెడ్డిగారు ప్రవేశపెట్టిన తీర్మానం మహాసభ ఏకగ్రీవామోదం పొందింది. ఆ తీర్మాన సారాంశం—

సోమశిలవద్ద డాం నిర్మించి పెన్నానీటిని నిల్వచేస్తే ప్రస్తుతం సాగుదల అవుతున్న 2 లక్షల ఎకరాలకుగాక; ఆత్మకూరు, కావలి, నెల్లూరు నార్తు డెల్టా, రాపూరు, వెంకటగిరి, గూడూరు తాలూకాలలో 5 లక్షల 45 వేల ఎకరాలు అదనంగా సాగవుతుంది. సోమశిలకు ఖర్చు తక్కువ, ఫలితమెక్కువ, పునరోగానికొచ్చేఅవకాశంహెచ్చు. సోమశిల నీరు కండలేరుతాలూకా దక్షిణసాద్దువరకు పారుతుందికాబట్టి, నాగార్జునసాగర్ కుడి కాల్వను అచ్చటతోనిలిపి; అచ్చటనుండి కుడికాల్వ నిర్మాణానికయ్యే 20 కోట్లలో 16 కోట్లు సోమశిల ప్రాజెక్టు డాం, చేరెజి, కాల్వకు వినియోగిస్తే, యింకా 4 కోట్లు మిగులుతుంది. సోమశిలకు ప్రత్యేకంగా ప్రభుత్వం ఖర్చుచేయవలసిన అవసరంలేదు. కావున యీ ప్రాజెక్టు నిర్మాణాన్ని తక్షణం ప్రారంభించవలసిందిగా ప్రభుత్వాన్ని యీ మహాసభవారు కోరుతున్నారు.

• • •

సోమశిలప్రాజెక్టు మూడవ ప్రణాళికలో సాధ్యంకాదని, అయితే ఆందోళన చేస్తుండవలసిందిగా ముఖ్యమంత్రి, పబ్లిక్ శాఖామాత్యులు సంగం, ఆత్మకూరుసభలలో స్పష్టంగా చెప్పారు. ఆత్మకూరు బహిరంగసభలో

—తరువ 12-వ పేజీలో.

## కనిగిరి ఉపాధ్యాయ కేంద్ర ఎన్నికలో పరిషత్తు విజయం

కనిగిరి ఉపాధ్యాయకేంద్రం కార్యదర్శి ఎన్నికలో కమ్యూనిస్టు అనుకూలసంస్థ ఉపాధ్యాయ ఫెడరేషను; తద్వ్యతిరేకసంఘమైన ఉపాధ్యాయ పరిషత్ మధ్య పోటీ తీవ్రంగా, హోరాహోరీగా జరిగి, పరిషత్ అభ్యర్థి శ్రీ సి. హెచ్. వెంకటనారాయణగారు అత్యధిక మెజారిటీతో ఎన్నుకోబడినారు. వెంకటనారాయణకు 67 ఓట్లురాగా, ఫెడరేషన్ అభ్యర్థి శ్రీ వి. బాలనాగయ్యగారికి 39 ఓట్లు మాత్రం వచ్చినవి. సహాయకార్యదర్శిగా మాత్రం శ్రీమతి కె. యల్. కొండమ్మగారు ఏకగ్రీవంగా ఎన్నుకోబడినారు.

కనిగిరి కేంద్రంలోని 130 మంది ఉపాధ్యాయులలో 100 మంది ఫెడరేషన్‌కు వ్యతిరేకులై పరిషత్తు సభ్యత్వం స్వీకరించారు. తాలూకాలోని 600 మంది ఉపాధ్యాయులలో దాదాపు 400 మంది పరిషత్ సభ్యులు. —యస్. కె. మస్తాన్.

—తరువ 11-వ పేజీలో.


## పోస్టాఫీసులలో దశాంశ పద్ధతి

ఫిబ్రవరి 1 నుండి అన్ని పోస్టాఫీసులలో మెట్రిక్ పద్ధతి అనుసరించబడుచున్నది. మార్పు చేయబడిన కొన్ని ముఖ్యమైన పోస్టల్ రేట్లు క్రిందివిధముగా వివరించబడినవి.

| ఇండియాలో రేట్లు | విదేశాలకు రేట్లు |
|---|---|
| ఉత్తరాలు | ఉత్తరాలు |
| మొదటి 15 గ్రాములకు 15 న. పై. | మొదటి 20 గ్రాములకు 30 న. పై. |
| అటుపైన ప్రతి అదనపు 15 గ్రాములకు 10 న. పై. | అటుపైన ప్రతి అదనపు 20 గ్రాములకు 20 న.పై. |
| ప్యాకెట్లు | ప్రింటుచేయబడినవి వగైరా |
| మొదటి 50 గ్రాములకు 8 న. పై. | మొదటి 50 గ్రాములకు 12 న.పై. |
| అటుపైన ప్రతి అదనపు 25 గ్రాములకు 3 న. పై. | అటుపైన ప్రతి అదనపు 50 గ్రాములకు 6 న. పై. |
| పార్సిళ్ళు | |
| ప్రతి 400 గ్రాములకు అందులోని విభాగములకు 50 న. పై. | వ్యాపార సంబంధమైన కాగితములకు మరియు నమూనాలకు 30 న. పై. |
| ప్యాకెట్లకు విమాన రవాణా అదనపు రేటు | |
| ప్రతి 10 గ్రాములకు లేక అందులోని విభాగములకు 4 న. పై. | |

ఇంకను:

పూర్తి వివరములకు, యితర రేట్లకు ఏ పోస్టాఫీసులోనైనా విచారించండి.

తంతి - తపాలాశాఖ

DA 60/686

